క్లుప్తంగా

జిల్లా సంక్షేమ అధికారిపై ఫిర్యాదు



ఫిర్యాదు చేస్తున్న నాయకులు

మంచిర్యాలటౌన్: జిల్లా సంక్షేమ శాఖ అధికారిగా గతంలో ఇక్కడే పనిచేసిన రౌఫ్‌ఖాన్ ఆర్థిక ఆరోపణలు ఎదుర్కొని, దివ్యాంగులతో దురుసుగా ప్రవర్తించి సస్పెండ్ అయి, మళ్లీ తిరిగి మంచిర్యాల జిల్లాకు తిరిగి పోస్టింగ్ పొందారంటూ దివ్యాంగుల హక్కుల పోరాట సమితి జాతీయ నాయకులు ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావుకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సస్పెండ్ అయిన చోటుకు తిరిగి అదే అధికారికి బాధ్యతలు అప్పగించారని, ఎమ్మెల్యే జోక్యం చేసుకొని మంచిర్యాల పోస్టింగ్‌ను రద్దు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పెద్దపల్లి సత్యనారాయణ, బండోజు నరేశ్, ఇందూరి రమేశ్, ముల్కల్ల రాజేంద్రప్రసాద్, దేవి ప్రకాశ్ పాల్గొన్నారు.

ఎంపీ, ఎమ్మెల్యే చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

చెన్నూర్‌రూరల్: మండలంలోని జోడు వాగుల వద్ద రోడ్డు మరమ్మతు పనులు చేసినందుకు గాను స్థానిక కాంగ్రెస్ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి, ఎంపీ గడ్డం వంశీకృష్ణ, ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి చిత్రపటాలకు శనివారం క్షీరాభిషేకం చేశారు. కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఉచిత కంటి ఆపరేషన్లు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): లయన్స్ క్లబ్ ఆఫ్ మంచిర్యాల, లయన్స్ క్లబ్ గోల్డెన్ జూబ్లీ సంయుక్తంగా రేకుర్తి లయన్స్ కంటి ఆస్పత్రి సౌజన్యంతో శనివారం హాజీపూర్ మండలం వేంపల్లిలో కంటి ఆపరేషన్లు అవసరమైన వారికి రేకుర్తిలో ఉచిత కంటి పరీక్షలు నిర్వహించి వేంపల్లి గ్రామానికి తీసుకొచ్చారు. 200మందికి కంటి పరీక్షలు జరపగా, 35మందికి రెండు రోజుల క్రితం ఉచితంగా కంటి సర్జరీలు నిర్వహించి, ఉచితంగా వేంపల్లికి తీసుకొచ్చారు.

సరుకుల వితరణ

బెల్లంపల్లి: బెల్లంపల్లిలోని అమ్మ–అనాథ శరణాలయానికి శనివారం దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ కంపెనీ ఆధ్వర్యంలో నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. సీఎస్ఆర్ కింద 2024–25సంవత్సరానికి గాను రూ.2లక్షల విలువైన ఏడాదికి సరిపడా దినసరి సరుకులను అమ్మ–అనాథ శరణాలయం వ్యవస్థాపకురాలు దుర్గం భాగ్యలక్ష్మికి కంపెనీ బాధ్యులు అందజేశారు. ఈ సందర్భంగా సిమెంట్ కంపెనీ యాజమాన్యానికి భాగ్యలక్ష్మి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కంపెనీ యూనిట్ హెడ్ బాలగిరిధర్, సీనియర్ హెచ్ఆర్ ఆనంద్ కులకర్ణి, జీఎం హెచ్ఆర్ ఉమా శంకర్‌రావు, తిరుపతి, సంతోష్‌రెడ్డి, అనాథ పిల్లలు పాల్గొన్నారు.

66ఎస్టీ ఆవాసాలకు త్రీఫేజ్ విద్యుత్

దండేపల్లి: మంచిర్యాల సర్కిల్ పరిధిలోని 66ఎస్టీ ఆవాసాలకు నార్త్ పవర్ డిస్ట్రిబూషన్ కంపెనీ ద్వారా త్రీఫేజ్ విద్యుత్ అందించినట్లు సర్కిల్ సూపరింటెండెంట్ గంగాధర్ తెలిపారు. దండేపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 72ఎస్టీ ఆవాసాలకు ప్రతిపాదనలు పంపగా, అందులో 66ఆవాసాలకు అందించినట్లు, మిగితా వాటికి అటవీశాఖ ఆమోదం పొందాల్సి ఉందన్నారు. అటవీశాఖ నుంచి అనుమతులు వచ్చిన వెంటనే యుద్ధప్రాతిపదికనా పనులు పూర్తి చేస్తామన్నారు.

గ్రూపు-2 పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

మందమర్రిరూరల్: ప్రభుత్వం ఆది, సోమవారం నిర్వహించే గ్రూపు-2 ఎగ్జామ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి తెలిపారు. పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఎస్సై రాజశేఖర్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో సిబ్బందికి సెంటర్ల వద్ద చేపట్టాల్సిన విధివిధానాలను సూచించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ఎగ్జామ్ కోసం వచ్చే అభ్యర్థులు నిబంధనలు పాటించాలని తెలిపారు. పరీక్షా కేంద్రాల సమీపంలో 163సెక్షన్ అమల్లో ఉంటుందని, జిరాక్స్ సెంటర్లు తెరువరాదని, గుంపులుగా తిరగరాదని తహసీల్దార్ సతీష్‌కుమార్ సూచించారు.



మంచిర్యాలరూరల్(హాజీపూర్): కొత్త ఆహార మెనూ వివరిస్తున్న డీఆర్డీవో కిషన్, తదితరులు



జైపూర్ గురుకులంలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న డీఎఫ్‌వో ఆశిష్‌సింగ్



మంచిర్యాలఅర్బన్: విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న డీసీపీ భాస్కర్, సీఐ ప్రమోద్‌రావు



చెన్నూర్ గిరిజన ఆశ్రమ పాఠశాలలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డీపీవో

ఆహార మెనూ ఆవిష్కరణ..!

- విద్యార్థుల సంక్షేమం కోసమే డైట్ చార్జీల పెంపు
- నాణ్యమైన భోజనం అందించాలని నిర్వాహకులకు సూచన
- పిల్లలతో కలిసి సహపంక్తి భోజనాలు చేసిన అధికారులు, ప్రజాప్రతినిధులు



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మోతీలాల్



బెల్లంపల్లి: సీఓఈ బాలుర గురుకులంలో మెనూ ఆవిష్కరిస్తున్న అధికారులు, ఉపాధ్యాయులు



దండేపల్లిలో ఆహార మెనూ గురించి వివరిస్తున్న రవీందర్‌రెడ్డి

మంచిర్యాలఅర్బన్/జన్నారం/జైపూర్/మందమర్రిరూరల్/బెల్లంపల్లి/నెన్నెల/రామకృష్ణాపూర్/దండేపల్లి/వేమనపల్లి/మంచిర్యాలరూరల్(హాజీపూర్): రాష్ట్రవ్యాప్తంగా అన్ని సంక్షేమ హాస్టళ్లలో ప్రభుత్వం ఒకే విధమైన డైట్ ప్లాన్ ప్రవేశపెట్టగా జిల్లాలోని అన్ని వసతి గృహాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు శనివారం ప్రారంభించారు. మెస్ చార్జీలను 1 నుంచి 7వ తరగతి విద్యార్థులకు రూ. 380, 8 నుంచి 10వ తరగతి విద్యార్థులకు రూ.440అదనంగా పెంచడం, కాస్మోటిక్ చార్జీలను 1 నుంచి 7వ తరగతి వరకు రూ.175, 8నుంచి పదో తరగతి వరకు రూ.275కు పెంచింది. ఈ సందర్భంగా పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు మాట్లాడారు. ప్రతీ రోజు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని, మెనూపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

- జన్నారం మండల కేంద్రంలోని బీసీ వసతి గృహంలో మంచిర్యాల అదనపు కలెక్టర్ మోతీలాల్ ఆహార మెనూ ప్రారంభించారు. విద్యార్థుల సంక్షేమం కోసమే ప్రభుత్వం కాస్మొటిక్, మెస్ చార్జీలు పెంచినట్లు తెలిపారు. ఉచితంగా పుస్తకాలు, దుస్తులు, మంచి భోజనం అందిస్తున్నట్లు, బాగా చదువుకొని భవిష్యత్తును బంగారుమయం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. గిరిజన సంక్షేమ శాఖ రాష్ట్ర చైర్మన్ కొట్నాక తిరుపతి కవ్వాల్, జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి వినోద్‌కుమార్ తదితరులు ఉన్నారు.
- హాజీపూర్ మండలం గఢ్‌పూర్‌లోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో హాజీపూర్ మండల ప్రత్యేకాధికారి, డీఆర్డీవో కిషన్ ప్రారంభించారు. అనంతరం విద్యార్థులతో కలిసి కొత్త ఆహార మెనూ ప్రకారం సిద్ధమైన భోజనాన్ని అధికారులు సహపంక్తి భోజనాలు చేశారు.
- జైపూర్ మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకులంలో కొత్త సామాన్య డైట్ మెనూను జిల్లా డీఎఫ్‌వో ఆశిష్‌సింగ్ ప్రారంభించారు.
- మందమర్రి పట్టణంలోని రెండో జోన్‌లో గల ఎస్సీ కళాశాల బాలుర హాస్టల్లో కామన్ మెనూ కార్యక్రమాన్ని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు ప్రారంభించారు.
- జిల్లా కేంద్రంలోని ఎస్టీ బాలుర కళాశాల వసతిగృహాన్ని డీసీపీ భాస్కర్, సీఐ ప్రమోదర్‌రావు సందర్శించి, విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. అంతకుముందు మున్సిపల్ కమిషనర్ విద్యార్థులతో అల్పాహారం చేశారు. బీసీ బాలుర కళాశాల వసతి గృహంలో మైనింగ్ ఏడీ జగన్మోహన్‌రెడ్డి, బీసీ సమీకృత వసతిగృహంలో డీసీఎస్‌వో బ్రహ్మారావు, సాయికుంట బాలికల ఆశ్రమ పాఠశాలలో జిల్లా వైద్యారోగ్య అధికారి హరీశ్‌రాజ్ ఆహార మెనూను ప్రారంభించారు.
- చెన్నూర్ గిరిజన ఆశ్రమ పాఠశాలలో జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు ప్రారంభించారు.
- దండేపల్లి బీసీ, ఎస్సీ వసతి గృహాల్లో జిల్లా దళిత అభివృద్ధి అధికారి రవీందర్‌రెడ్డి ఆహార మెనూను ప్రారంభించారు.

కనుల పండువగా వేంకటేశ్వర కల్యాణం



పూజలు చేస్తున్న భక్తులు

తాండూర్: మండలంలోని రేచినీ గ్రామం శ్రీసంతాన దత్త సహిత శివ కేశవ దేవస్థానంలో శనివారం శ్రీ వేంకటేశ్వర కల్యాణం, శ్రీ దత్త జయంతి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. రాజరాజేశ్వరీ పీఠం ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన సుబ్బా దత్తుమూర్తి దంపతుల పర్యవేక్షణలో లోక కల్యాణం కోసం వేడుకలను ప్రారంభించారు. ఉదయం లలితా సహస్ర పారాయణం, శ్రీచక్ర పూజ హవనం, కుండ స్థాపన, అగ్నిప్రతిష్ట, ఆగమోక్త అగ్నిముఖం ప్రత్యేక పూజలు, శ్రీదేవి భూదేవి సహిత వేంకటేశ్వర కల్యాణ మహోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు.

అయ్యప్పకు ప్రత్యేక పూజలు



పూజలో పాల్గొన్న కొక్కిరాల సురేఖ

నస్పూర్: పట్టణ పరిధిలోని షిర్కే కాలనీ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో కొక్కిరాల రఘుపతిరావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అయ్యప్ప స్వాములకు శనివారం ఏర్పాటు చేసిన మహాన్నదాన కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ పాల్గొన్నారు. ఆమె అయ్యప్ప స్వాములకు, భక్తులకు భోజనాలు వడ్డించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నదాన కార్యక్రమానికి సహకరించిన ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావుకు అయ్యప్ప స్వాములు, ఆలయ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. సురేఖను స్వాములు శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పలువురు కౌన్సిలర్లు నాయకులు, అయ్యప్ప స్వాములు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమ్మెకు మద్దతు



సమ్మెకు మద్దతు తెలుపుతున్న దివాకర్‌రావు

మంచిర్యాలఅగ్రికల్చర్: సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడానికి చాయి తాగేంత సమయంలో పరిష్కరిస్తాని హామీ ఇచ్చిన ఆనాటి పీసీసీ అధ్యక్షుడు, నేటి సీఎం రేవంత్‌రెడ్డికి ఏడాది గడిచినా చాయి తాగే సమయం పూర్తి కాలేదా..? అని మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు ప్రశ్నించారు. సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు జిల్లా కలెక్టరేట్ ఎదుట చేపట్టిన సమ్మెకు మద్దతుగా శనివారం మాజీ ఎమ్మెల్యే సంఘీభావాన్ని తెలిపి మాట్లాడారు. కొద్ది రోజులుగా సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు నిరసన, సమ్మె చేపడుతున్నా న్యాయమైన సమస్యలు పరిష్కరించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో వచ్చి ఏడాది పూర్తయిందని, ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా సంబురాలు చేసుకుంటుందని విమర్శించారు. వెంటనే ఉద్యోగులను రెగ్యూలర్ చేయడం, రూ.25లక్షల బీమా, తదితర డిమాండ్లను ప్రభుత్వం బేశజాలకు పోకుండా ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

సమ్మెకు పలువురి సంఘీభావం..

సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల 5వ రోజు సమ్మెలో భాగంగా శనివారం మహిళా ఉద్యోగులు బతుకమ్మ ఆడి నిరసన తెలిపారు. సమ్మెకు మద్దతుగా స్వతంత్ర్య ఎమ్మెల్సీ అభ్యర్థి యాదగిరి శేఖర్‌రావు, ఎస్‌టీయూటీఎస్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి బాపన్న, ఎస్టీటీయూ జిల్లా అధ్యక్షుడు శ్రీకర్, ప్రధాన కార్యదర్శి రాజేందర్, పలు సంఘాల నాయకులు సంఘీభావం తెలిపారు.

చట్టబద్ధ హక్కులు కల్పించాలి



నిరసన తెలుపుతున్న ఐఎఫ్‌టీయూ నాయకులు

మందమర్రిరూరల్: మండల కేంద్రంలోని కేజీబీవీ, మోడల్ స్కూళ్లో ఐఎఫ్‌టీయూ నాయకుల ఆధ్వర్యంలో శనివారం నిరసన వ్యక్తం చేశారు. కేజీబీవీ, మోడల్ స్కూళ్లలో పనిచేస్తున్న నాన్ టీచింగ్ స్టాఫ్‌కు చట్టబద్ధ హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు జాఫర్, అరుణ, నాన్ టీచింగ్ స్టాఫ్ స్వర్ణలత, తిరుమల, రాజేశ్వరి, స్వరూప, తదితరులు ఉన్నారు.

లోక్ అదాలత్‌తో కేసులు పరిష్కారం

- ఇరుపక్షాలు రాజీపడితే ఇరువురూ విజేతలే...



చెన్నూర్‌లో కక్షిదారులను విచారిస్తున్న మేజిస్ట్రేట్ రవి



లక్సెట్టిపేట: కక్షిదారును విచారిస్తున్న జడ్జి



బెల్లంపల్లి: కేసు పరిష్కరిస్తున్న న్యాయమూర్తి ముకేష్

చెన్నూర్/లక్సెట్టిపేట/బెల్లంపల్లి: రాజీమార్గమే రాజమార్గమని, ఇరు పక్షాలు రాజీపడితే ఇరువురు విజేతలేనని చెన్నూర్‌లో జడ్జి పర్వతపు రవి, లక్సెట్టిపేటలో జూనియర్ సివిల్ జడ్జి మహ్మద్ అసదుల్లా షరీఫ్, బెల్లంపల్లిలో జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి ముకేష్ అన్నారు. చిన్నచిన్న తగాదాలతో కోర్టులు, పోలీస్‌స్టేషన్‌ల చుట్టూ తిరిగి డబ్బు, సమయం వృథా చేసుకోవద్దన్నారు. చెన్నూర్, బెల్లంపల్లి, లక్సెట్టిపేటల్లోని ఆయా కోర్టుల్లో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. చెన్నూర్ లోక్ అదాలత్‌లో బ్యాంక్ సంబంధించిన కేసులు 45పరిష్కారం కాగా రూ. 24.62 లక్షలు, సివిల్ కేసులు 3, క్రిమినల్ కేసులు 49, డ్రంక్, డ్రైవ్ కేసులు 227కేసులు పరిష్కారం కాగా రూ.4,54లక్షల జరిమానా విధించారు. కోర్టు పరిధిలో వివిధ కేసులతో కలిపి మొత్తం 470కేసులు పరిష్కారమయ్యాయి. లక్సెట్టిపేటలో 1521కేసులు పరిష్కరించారు. బెల్లంపల్లిలో మొత్తం 1,320 కేసులు పరిష్కరించారు. ఆయా కార్యక్రమంలో చెన్నూర్‌లో జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్, చెన్నూర్, కోటపల్లి సీఐలు రవీందర్, సుధాకర్, బ్యాంక్ మేనేజర్లు, ఎక్సైజ్ అధికారులు పాల్గొనగా, లక్సెట్టిపేటలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కిరణ్‌కుమార్, ఏజీపీ వేల్పుల సత్యం, న్యాయవాదులు రాజేశ్వర్‌రావు, భూమారెడ్డి, అక్కల శ్రీధర్, కారుకూరి సురేందర్, సత్తన్న, ప్రదీప్, పద్మ, ప్రకాశం, ఉమరాణి, సజని, కోర్టు సూపరింటెండెంట్ రమేష్, బెల్లంపల్లిలో న్యాయవాదులు, కోర్టు, పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై చర్చ

మంచిర్యాలటౌన్: మంచిర్యాల మార్కెట్‌లోని రోడ్ల వెడల్పు, వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా శనివారం సాయంత్రం ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు మార్కెట్లో పర్యటించారు. ఈ సందర్భంగా మార్కెట్‌లో చేపట్టాల్సిన అభివృద్ధి పనుల గురించి మున్సిపల్ ఇంజనీర్ అధికారులతో చర్చించారు. వ్యాపారులతో కలిసి చాయ్ తాగుతూ ముచ్చటించారు.

'స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీదే గెలుపు'



మాట్లాడుతున్న రఘునాథ్

బెల్లంపల్లి: వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించడం తథ్యమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు వి.రఘునాథ్ తెలిపారు. బెల్లంపల్లిలో శనివారం నిర్వహించిన బీజేపీ సంస్థాగత ఎన్నికల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. ఆరు గ్యారంటీలను అమలు చేయకపోవడం వల్ల ప్రజల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోందని పేర్కొన్నారు. హామీలను నెరవేరుస్తుందని నమ్మి ఓట్లు వేసి గెలిపిస్తే, కాంగ్రెస్ పార్టీ ప్రజలను నట్టేట ముంచిందని విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌పార్టీకి తగిన బుద్ధి చెప్పాలని, ప్రజల కోసం పోరాడుతున్న బీజేపీని గెలిపించడానికి సిద్ధంగా ఉండాలని అన్నారు. సమావేశంలో బీజేపీ జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి లింగారెడ్డి, మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రజనీష్ జైన్, అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ రాచర్ల సంతోష్, సభ్యత్వ నమోదు జిల్లా కన్వీనర్ కృష్ణమూర్తి, కో కన్వీనర్ కృష్ణ దేవరాయలు, జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు పుల్గం తిరుపతి, కార్యదర్శి గోవర్ధన్, బీజేపీ మండల అధ్యక్షులు కళ్యాణి, భరత్‌కుమార్, రామన్న, శైలేందర్ సింగ్, సీనియర్ నాయకులు కేశవ రెడ్డి, మహీధర్‌గౌడ్, శ్రీనివాస్, రాజ్‌కుమార్, కమల పాల్గొన్నారు.

కొనసాగుతున్న రక్షణ పక్షోత్సవాలు



ఎస్సార్పీ 3 గనిలో ఉద్యోగులకు బహుమతి ప్రదానం చేస్తున్న అధికారులు

శ్రీరాంపూర్: సింగరేణిలో 55వ వార్షిక రక్షణ పక్షోత్సవాలు కొనసాగుతున్నాయి. శనివారం పలు గనులపై రక్షణ తనిఖీ కమిటీ సభ్యులు తనిఖీ నిర్వహించి రక్షణ ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఎస్సార్పీ 3 గనిలో ఈ పక్షోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సింగరేణి జీఎం (చీఫ్ ఆఫ్ సేఫ్టీ) చింతల శ్రీనివాస్, బెల్లంపల్లి రీజియన్ జీఎం(సేఫ్టీ) కే రఘుకుమార్, శ్రీరాంపూర్ ఏరియా జీఎం ఎల్వీ సూర్యనారాయణ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు ఉద్యోగులతో అధికారులతో రక్షణ ప్రతిజ్ఞ చేయించారు. రక్షణతో కూడిన ఉత్పత్తి మాత్రమే శ్రేయస్కరమన్నారు. ప్రమాద రహిత సంస్థగా సింగరేణిని తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. ట్రేడ్ టెస్ట్‌లో ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో రక్షణ తనిఖీ కమిటీ కన్వీనర్, జీఎం(ఐ, పీఎం) బత్తుల శ్రీనివాస్, గుర్తింపు సంఘం ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి షేక్ బాజీసైదా, ఏజెంట్ వెంకటేశ్వర్లు, ఏరియా రక్షణ అధికారి శ్రీధర్ రావు, గని మేనేజర్ వెంకట్రావు, గని రక్షణ అధికారి మహేందర్, సంక్షేమాధికారి ఎస్ఎండీ పాషా, తనిఖీ బృందం సభ్యులు పీ శ్రీనివాస్, ఉమాకాంత్, జనార్దన్ రెడ్డి, మేక డేవిడ్, యూనియన్ పిట్ సెక్రెటరీ మురళి చౌదరి తదితరులు పాల్గొన్నారు. శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే 5 గనిలో రక్షణ పక్షోత్సవాలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గ్రూపు ఏజెంట్ శ్రీధర్ హాజరయ్యారు. రక్షణ తనిఖీ బృందం సభ్యులు గనిలోకి దిగి రక్షణ చర్యలు పరిశీలించారు. కార్యక్రమంలో రక్షణ తనిఖీ బృందం కన్వీనర్, జీఎం(ఎన్విరాన్‌మెంట్) బానోత్ సైదులు, సభ్యులు కట్ట శ్రీధర్, రాధా కృష్ణ, ఉజ్వల్ బందోపాధ్యాయ, దామోదర్, జే శ్రీనివాస్‌తో పాటు గని మేనేజర్ సుధీర్ కుమార్, రక్షణ అధికారి రాందాస్, సంక్షేమ అధికారి రణదీప్ గౌడ్, అసిస్టెంట్ మేనేజర్ శివయ్య, తదితరులు పాల్గొన్నారు.

'గుర్తింపు సంఘం విఫలం'

శ్రీరాంపూర్: కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో గుర్తింపు సంఘం ఏఐటీయూసీ విఫలమైందని తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మిట్టపల్లి కుమార్‌స్వామి తెలిపారు. ఎస్ఆర్పీ 3గనిలో శనివారం ఆయన ఉద్యోగులను కలిసి మాట్లాడారు. గుర్తింపు సంఘం గెలిచి సంవత్సరం పూర్తైనా, ఇప్పటికీ సమస్యలు పరిష్కరించలేదన్నారు. వారిని కార్మికులు నిలదీయాలన్నారు. పెండింగ్ సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఆసంఘం ఉపాధ్యక్షుడు దేవి సత్యనారాయణ, డి విజన్ కార్యదర్శి సమ్ము రాజన్న, నాయకులు ఉదయ్ పాల్గొన్నారు.

బొగ్గుబాయి వార్తలు

ఆటలో మెలకువలు నేర్చుకోవాలి



శిక్షణ పొందుతున్న క్రీడాకారులు

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్‌లోని ప్రగతి మైదానంలోని సీఈఆర్ క్లబ్‌లో వాలీబాల్ శిక్షణ శిబిరం కొనసాగుతుంది. కంపెనీ లెవల్ జట్టు ఇక్కడ మూడు రోజులుగా శిక్షణ పొందుతుంది. కోలిండియా పోటీల్లో పాల్గొనడం కోసం ఇక్కడ శిక్షణ ఇస్తున్నారు. శుక్రవారం రాత్రి శిక్షణ శిబిరాన్ని ఇన్‌చార్జీ డీజీఎం(పర్సనల్) ఏ. రాజేశ్వర్ పరిశీలించారు. ఆటలో మెలకువలు నేర్చుకొంటే రాణిస్తారన్నారు. కార్యక్రమంలో సీనియర్ పీఓ కాంతారావు, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ నర్సయ్య, ఇండోర్ కెప్టెన్ తోట సురేశ్, వాలీబాల్ కెప్టెన్ చిన్నయ్య పాల్గొన్నారు.

కల్చరల్ టీంల ఎంపిక

శ్రీరాంపూర్: ఈ నెల 23న ప్రగతి మైదానంలో జరిగే సింగరేణి ఆవిర్భావ దినోత్సవంలో పాల్గొనే కల్చరల్ టీంలకు ఎంపిక పోటీలు జరిగాయి. సీసీసీలోని సింగరేణి ఎస్సీఓఏ క్లబ్‌లో శనివారం ఈ పోటీలు నిర్వహించారు. 15పాఠశాలలకు చెందిన 340మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఇందులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన టీంలను ఎంపిక చేసి, వారితో ప్రదర్శనలిప్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డీజీఎం(పర్సనల్)ఏ. రాజేశ్వర్, సీనియర్ పీఓ కాంతారావు, సభ్యులు శ్యాంసుందర్, కళాకారులు పాల్గొన్నారు.

'తొలగించిన డ్రైవర్లను విధుల్లోకి తీసుకోవాలి'

శ్రీరాంపూర్: మందమర్రి డివిజన్ పరిధిలోని ఏరియా వర్క్‌షాప్‌లో విధుల్లో నుంచి తొలగించి కన్వేయన్స్ డ్రైవర్ సంతోశ్‌ను వెంటనే తీసుకోవాలని సీఐటీయూ డివిజన్ అధ్యక్షుడు కాజీపేట రాజేశం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అకారణంగా అతడిని తొలగించారన్నారు. దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అతడిని విధుల్లోకి తీసుకోనియెడల డ్రైవర్లంతా కలిసి ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు.